క్లుప్తంగా

మోదీ మహా మోసం

చిత్తూరు కార్పొరేషన్: ప్రధాని నరేంద్ర మోదీ విశాఖ పర్యటనలో విశాఖ స్టీలుపై ప్రకటన చేయకపోవడం బాధాకరమని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల మనోభావాలను ఏమాత్రం గౌరవించకుండా మరోసారి మోసం చేశారని తప్పుబట్టారు. రాష్ట్ర ప్రజలు ఆందోళన చెందుతున్న విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై ప్రధాని ఒక్కమాట కూడా మాట్లాడకపోవడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఆయన సుదీర్ఘ ప్రసంగంలో శంకుస్థాపన చేసిన ప్రాజెక్టుల గొప్పలు చెప్పుకోవడానికి సరిపోయిందని విమర్శించారు. విశాఖ స్టీలుపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి స్పందించకపోవడం వారి చిత్తశుద్ధికి నిదర్శనమని చెప్పారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి


అర్జీలను పరిశీలిస్తున్న తహసీల్దార్ సుధాకర్

తవణంపల్లె: మండలంలో రెవెన్యూ సదస్సుల్లో రైతులు ఇచ్చే అర్జీలకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ సుధాకర్ తెలిపారు. ఆయన బుధవారం మండలంలోని ఉత్తరబ్రాహ్మణపల్లెలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో తహసీల్దార్ సుధాకర్ మాట్లాడుతూ రైతులు తమ భూ సమస్యలను మా దృష్టికి తీసుకొచ్చి అర్జీలు ఇస్తే క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామని వివరించారు. రైతులు పలు భూ సమస్యలపై అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ జీవన్‌కుమార్, మండల సర్వేయర్ మురళీకృష్ణ, వీఆర్ఓ రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక ప్రయోజనాలు


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ వరలక్ష్మి

ఐరాల: రైతులు సాగులో పంటల మార్పిడి పద్ధతి పాటిస్తే తద్వారా అధిక ప్రయోజనాలు పొందవచ్చని ఏఓ వరలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని వడ్రాంపల్లె, 45 కొత్తపల్లె గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి సారీ ఒకే రకమైన పంటను వేయకుండా తరచు పంటల మార్పిడి చేయడం వల్ల అధిక దిగుబడులు పొందవచ్చని ఆ దిశగా రైతులు ప్రయత్నించాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు పాల్గొన్నారు.

తిరుమల కొండయ్యపల్లిలో జల్లికట్టు


ఎద్దును నిలువరిస్తున్న యువకులు

పూతలపట్టు (కాణిపాకం): పూతలపట్టు మండలం తిరుమలకొండయ్యపల్లెలో బుధవారం జల్లికట్టు నిర్వహించారు. గోమాతకు ప్రత్యేక పూజలు చేసి ఈ జల్లికట్టును ప్రారంభించారు. అనంతరం ఎద్దులను పరుగులు పెట్టించారు. వాటిని నిలువరించేందుకు యువకులు, పెద్దలు పోటీలు పడ్డారు. ఇందులో నెగ్గిన వాటికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ జల్లికట్టును తిలకించేందుకు చుట్టుపక్కల నుంచి గ్రామస్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు.

రైతన్నలు బిజీబిజీ

వరినాట్లకు పొలం సిద్ధం చేస్తున్న రైతన్న


నాట్లకు ముందు యూరియా వేస్తున్న రైతన్న


వరినాట్లకు సిద్ధం చేసిన పొలాలు


గుడిపాల: వణికించే చలిలో తెల్లారక ముందే రైతన్న పొలంబాట పడుతున్నారు. మోకాటి లోతు బురదలో దిగి పొలం పనులు చేస్తున్నారు. మండేఎండ అయినా కురిసే వాన అయినా రైతుకు కష్టం తప్పదు. పోనీ అంత కష్టపడితే తగిన ఫలితం దక్కుతుందా అంటే అదీ లేదు. అయినా తన వృత్తి ధర్మాన్ని పాటిస్తూ ప్రకృతితోపాటే రైతన్న సేద్యం వైపు పరుగులు తీస్తున్నారు. మండలంలో రైతన్నలు పొలం పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. పిళ్లారికుప్పం, పాపసముద్రం, అడవిచేను, గుడిపాల, చిత్తపార, బండపల్లె, బట్టువాళ్లూరు, చింతగుంటూరు, బొమ్మసముద్రం, 197రామాపురం, కోలావూరు, పేయనపల్లె గ్రామాల్లో రైతులు వరిపంటకు దుక్కులు సిద్ధం చేస్తున్నారు. మరికొంత మంది వరిపంట నాటేందుకు సిద్ధంగా ఉన్నారు. ఎద్దులతో మడక దున్నుతూ బిజీబిజీగా ఉన్నారు.

జానపద కళలను కాపాడుకుందాం


కళాకారులను సన్మానిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

ఐరాల: జానపద కళలు, సంగీతం మనకు స్థానిక సంస్కృతులు తెలియజేస్తాయని జానపద కళాకారులు రెడ్డెప్ప, రాజశేఖర్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు మన సంస్కృతి కళాసంస్థ తిరుపతి వారి ఆధ్వర్యంలో జానపద కళలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ జానపద సాహిత్యం, సంగీతం మనసును ప్రశాంతంగా ఉంచుతుందన్నారు. జానపద కళలను భావితరాలకు అందించేందుకు విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని చెప్పారు. విద్యార్థులను చైతన్య పరుస్తూ పర్యావరణ విద్య ఆవశ్యకత, నైతిక స్థైర్యాన్ని నింపుతూ ఆటపాటలతో చైతన్య పరిచారు. అనంతరం కళాకారులను ప్రిన్సిపల్ రెడ్డిరామరాజు, అధ్యాపకులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి విజయ్‌కుమార్, డప్పు కళాకారిణి గంగులమ్మ పాల్గొన్నారు.

ఎంపీటీసీకి విజయానందరెడ్డి పరామర్శ


డానియల్‌ను పరామర్శిస్తున్న విజయానందరెడ్డి

గుడిపాల: మండల వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, బసవాపల్లె ఎంపీటీసీ డానియల్‌ను చిత్తూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి బుధవారం పరామర్శించారు. ఇటీవల గుండెకు శస్త్రచికిత్స చేసుకున్న డానియల్‌ను బొమ్మసముద్రం హైస్కూల్ రోడ్డులో ఆయన స్వగృహంలో పరామర్శించి ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆయనతో పాటు మండల నాయకులు రాసనపల్లె ప్రకాష్, మధురాయల్, రజినీకాంత్, మధుసూదన్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, చిట్టిబాబు, కేపీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కుర్చీలు ఖాళీ



గుడిపాల: ప్రజలకు అందుబాటులో ఉండి వారికి సేవలు చేయాల్సిన అధికారులు కార్యాలయానికి రాకపోవడంతో ఇలా ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. మండలంలోని పాపసముద్రం సచివాలయంలో అధికారులు, సిబ్బంది ఎవరూ కనపడలేదు. వారికి కేటాయించిన కుర్చీలు మాత్రం ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఇక్కడ వెప్పాలమానుచేను పంచాయతీ కార్యదర్శి మాత్రం ఒక్కరే ఉన్నారు. మిగిలిన సిబ్బంది అంతా ఎక్కడికి వెళ్లారో కూడా తెలియడం లేదు. సచివాలయ సిబ్బందికి కేటాయించిన కుర్చీలన్నీ ఖాళీగానే దర్శనమిస్తున్నాయి.

చిత్తూరు పూర్వపు కమిషనర్‌పై

విచారణ ప్రారంభం


కమిషనర్‌తో కలిసి అధికారులను విచారిస్తున్న ఆర్డీ విశ్వనాథ్

చిత్తూరు అర్బన్: స్థానిక మున్సిపల్ కార్పొరేషన్‌లో గతంలో కమిషనర్‌గా పనిచేసిన జె.అరుణపై అధికారులు విచారణ ప్రారంభించారు. బుధవారం అనంతపురం మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజినల్ డైరెక్టర్ (ఆర్డీ) విశ్వనాథ్ తన బృందంతో వచ్చి చిత్తూరు కార్పొరేషన్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. 2022 నుంచి 2024 సెప్టెంబర్ వరకు చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో అరుణ కమిషనర్‌గా పనిచేశారు. ఆమె పనిచేసిన కాలంలో కార్యాలయంలోని ప్రజారోగ్యం, పట్టణ ప్రణాళిక, మెప్మా, ఇంజినీరింగ్ విభాగాల్లో పలు అవినీతి కార్యకలాపాలు జరిగాయని, దీంతో రూ.కోట్ల మొత్తంలో ప్రజాధనం దుర్వినియోగం అయ్యిందని కూటమి ప్రభుత్వానికి పలు ఫిర్యాదులు అందాయి. దీనిపై రాష్ట్ర మౌలిక వసతులు-సదుపాయాల కల్పన విభాగం డిప్యూటీ డైరెక్టర్ నాగేంద్ర బియానీని విచారణ అధికారిగా నియమిస్తూ డైరెక్టరేట్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (డీఎంఏ) హరినారాయణన్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే మరికొన్ని అభియోగాలపై విచారణ చేయడానికి అనంతపురం మున్సిపల్ ఆర్డీ విశ్వనాథ్‌ను సైతం నియమించారు. దీంతో విశ్వనాథ్ పలు ఫైళ్లను చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ నుంచి తెప్పించుకుని పరిశీలించారు. విచారణ కమిటీలో ఉన్న నజీర్ హుస్సేన్ (ఆదోని మున్సిపల్ ఆర్వో), పీఎస్.మహేష్ (డీఈ, పుంగనూరు), శ్రీనివాసులు (జేఏఓ, పుంగనూరు), వినోద్ ప్రీతమ్ (సీనియర్ అసిస్టెంట్, మదనపల్లె), రూపేష్ (ఏఈ, మదనపల్లె), నీరజాక్షి (టీపీఓ, పుత్తూరు), చంద్రమోహన్ (డీటీసీపీ, చిత్తూరు)తో కలిసి పలు ఫైళ్లను తనిఖీ చేశారు. నాలుగు రోజుల పాటు ఈ విచారణ కొనసాగే అవకాశం ఉంది. అనంతరం నివేదికను డీఎంఏకు అందజేస్తారు. త్వరలోనే మరో విచారణ అధికారి నాగేంద్ర బియానీ సైతం చిత్తూరుకు వచ్చి పలు ఆరోపణలపై విచారణ చేయనున్నారు.

రెండో సారి రాష్ట్ర కార్యదర్శిగా జీవీ రమణ



చిత్తూరు కలెక్టరేట్ : యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా చిత్తూరు జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు జీవీ రమణ రెండోసారి ఎన్నికయ్యారు. ఈ మేరకు ఈ నెల 5,6,7,8 తేదీల్లో కాకినాడలో నిర్వహించిన ఆ సంఘం రాష్ట్ర స్వర్ణోత్సవ విద్యా వైజ్ఞానిక మహాసభల్లో నిర్వహించిన ఎన్నికల్లో ఆయన రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. రమణ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సోమశేఖర్‌నాయుడు, మణిగండన్, దీనావతి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారని పేర్కొన్నారు.

హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ


పీహెచ్‌సీలో మాట్లాడుతున్న డాక్టర్ వెంకటప్రసాద్

తవణంపల్లె: గర్భిణుల్లో హైరిస్క్ కేసులపై డాక్టర్లు, వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా అదనపు వైద్యఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ తెలిపారు. ఆయన బుధవారం సాయంత్రం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు, సలహాలిచ్చారు. మండలంలో ఎంత మంది క్షయ వ్యాధిగ్రస్తులు ఉన్నారని ఆరా తీశారు. క్షయవ్యాధిగ్రస్తులకు సక్రమంగా మందులు పంపిణీ చేయాలని చెప్పారు. గ్రామాల్లో క్షయవ్యాధిగ్రస్తులను సర్వే చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేసి నివేదిక పంపాలన్నారు. మాతా శిశుమరణాలు నివారణకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రియాంక, ఆసుపత్రి సిబ్బంది, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి పాల్గొన్నారు.

నెమలిని రక్షించిన యువత


నెమలిని ఫారెస్టు అధికారులకు అప్పగిస్తున్న యువకులు

బంగారుపాళెం: రహదారిపై గాయపడి ఉన్న నెమలిని బుధవారం సాయంత్రం యువకులు రక్షించి బంగారుపాళెంలోని ఫారెస్టు కార్యాలయంలో అధికారులకు అప్పగించారు. మండలంలోని బోడబండ్ల క్రాస్ సమీపంలో ఓ నెమలి గాయపడి లేవలేని స్థితిలో పడి ఉంది. అదే సమయంలో నలగాంపల్లెకు చెందిన యువకులు గౌతమ్, దిలీప్, రోహిత్, బాబు, సంతోష్, ప్రభాకర్ జాన్సన్, సూర్య రన్నింగ్ ప్రాక్టీస్ చేస్తుండగా వారి కంట పడింది. నెమలికి తాగు నీరు అందించి బంగారుపాళెం గ్రామానికి తీసుకు వచ్చారు. ఫారెస్టు కార్యాలయంలో ఎఫ్‌బీఓ పద్మకు అప్పగించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన తరువాత అటవీలో వదలిపెడతామని ఫారెస్టు అధికారులు తెలిపారు.

పశువులకు గాలికుంటు టీకాలు వేయించండి


పశువులకు మందు తాపిస్తున్న వైద్య సిబ్బంది

గుడిపాల: పాడి రైతులతోనే ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని పశువైద్యాధికారి సాయిసుధ తెలిపారు. మండలంలో బుధవారం 190రామాపురంలో పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ పశువుల్లో పిడుదులు నివారించినపుడు పశువుల్లో ఎదుగుదల మెరుగ్గా ఉంటుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ వారి పశువులకు గాలికుంటు టీకాలు వేయించుకోవాలని సూచించారు. దీని వల్ల పాలదిగుబడి తగ్గుతుందనే అపోహలు వీడాలన్నారు. అనంతరం పాడి పశువులకు పిడుదుల మందు స్ప్రే చేయడంతో పురుగుల మందు, గర్భకోశవ్యాధులకు చికిత్స చేశారు. లంపిస్కిన్ వ్యాధిపై అవగాహన కల్పించారు. వైద్యశిబిరానికి 170 పశువులు రాగా వాటికి వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది అబ్దుల్లా, కిషోర్, వెంకటేష్ పాల్గొన్నారు.

పల్లె ముంగిటకే ఉచిత వైద్య సేవలు


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రియాంక

తవణంపల్లె: పల్లె ముంగిటకే మెరుగైన వైద్య సేవలందిస్తున్నామని వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. ఆమె బుధవారం మండలంలోని కొండ్రాజుకాలువలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ప్రియాంక 37 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. శీతాకాలంలో రోగాలు బారినపడకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు వైద్యబృందం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

వెంగంపల్లెలో..

మండలంలోని వెంగంపల్లెలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ కేశవనారాయణ ఉచిత వైద్య శిబిరం నిర్వహించి 40 మంది రోగులకు వైద్య పరీక్షలు చేయించారు. గర్భవతులు, చిన్న పిల్లలకు, వృద్ధులకు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు, బాలింతలు, గర్భవతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత


విద్యార్థికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఐరాల: మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడే పరిస్థితులు ఎక్కువగా ఉంటాయని, ఆరోగ్య జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని చుక్కావారిపల్లెలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 60 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా, పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ జీవకళ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మరకాలకుప్పంలో వైద్యశిబిరం

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ప్రజలకు ఇంటి వద్దే వైద్యం అందుతోందని బొమ్మసముద్రం పీహెచ్‌సీ డాక్టర్ రష్మిత అన్నారు. మరకాలకుప్పం గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. బీపీ, చక్కెర వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. 60 రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శశికళ, యమున, దేవప్రీత, రాధ పాల్గొన్నారు.

టీచర్లకు క్యాలెండర్ల పంపిణీ


పీఆర్‌టీయూ క్యాలెండర్లు అందుకున్న నగరపాలక టీచర్లు

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని నగరపాలక పాఠశాలల టీచర్లకు పీఆర్‌టీయూ నూతన సంవత్సరం క్యాలెండర్‌లు, డైరీలు అందజేసినట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం నగరంలోని కట్టమంచి, గిరింపేట, కొంగారెడ్డిపల్లి, సంతపేటల్లో ఉన్న నగరపాలక పాఠశాలల్లో క్యాలెండర్లు, డైరీలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఎలాంటి సమస్యలున్నా తమ సంఘం దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామి కణ్ణన్, నగరపాలక పాఠశాలల టీచర్లు పాల్గొన్నారు.

ఓం శక్తి భక్తుల అన్నదానం


అన్నదానం చేస్తున్న ఓంశక్తి భక్తులు

బంగారుపాళెం: మండలంలోని తగ్గువారిపల్లె ఇందిరమ్మ కాలనీలో బుధవారం ఓంశక్తి భక్తులు అన్నదానం చేశారు. గురుశక్తులు సౌందర్యమ్మ, వసంతమ్మ ఆధ్వర్యంలో ఓం శక్తి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం గ్రామంలో అన్నదానం చేశారు. రాత్రి ఇరుముళ్లు కట్టి మేల్‌మరవత్తూరులో అమ్మవారిని దర్శించుకునేందుకు బయలుదేరారు.

అనధికారికంగా సీసీ రోడ్ల నిర్మాణంపై ఫిర్యాదు

- అప్పయ్యగారిపల్లిలో ఒకే ఇంటికి రోడ్డు
- కలెక్టర్‌కు గ్రామస్తుల ఫిర్యాదు
- తమకు సంబంధం లేదంటున్న అధికారులు


అనుమతిలేని చోట వేసిన సీసీరోడ్డు

సాక్షి టాస్క్‌ఫోర్స్: చకచక రోడ్లు వేసి నాలుగు కాసులు మిగుల్చుకోవాలని కూటమి నేతలు కంకణం కట్టుకున్నారు. దీనికి తోడు వర్క్‌లు ఇతరులకు దక్కకూడదన్న పంతానికి దిగారు. ఈ పంతం నెరవేర్చుకోవడానికి అనుమతి లేకుండా అనధికారికంగా సీసీ రోడ్లు నిర్మిస్తున్నారు. చివరకు కలెక్టర్‌కు ఫిర్యాదు వెళ్లడంతో ఆ అనాధికారిక పనులకు బ్రేకులు పడ్డాయి. చిత్తూరు మండలం దిగువమాసాపల్లి పంచాయతీ అప్పయ్యగారిపల్లిలో అనుమతి లేకుండా సీసీ రోడ్లు వేస్తున్నారని గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే ఒకే ఒక ఇల్లు ఉన్న ప్రాంతానికి రోడ్డు వేస్తున్నారని విన్నవించారు. ఈ ఫిర్యాదుతో కలెక్టర్ తక్షణం స్పందించినట్లు తెలిసింది. వెంటనే మండల అధికారులు స్పందించారు. పనులను పరిశీలించారు. ఆ పనులతో తమకు ఎలాంటి సంబంధం లేదని చేతులెత్తేశారు. అనధికారికంగా రోడ్లు వేయడంతో పాటు ఒకే ఇల్లు.. కాస్త జాగా ఉన్నా అక్కడ పాగా వేసి రోడ్లు వేసేస్తున్నట్లు గుర్తించారు. కొన్ని రోజుల క్రితం ఈ రకంగా పనులు చేస్తున్నారని పీఆర్‌లోని ఓ డివిజన్ స్థాయి అధికారి దృష్టికి వెళ్లింది. అయితే ఆ అధికారి అక్కడ ఉన్న వాళ్లంతా తన బంధువులే అంటూ తోసిపుచ్చారు. తీరా కలెక్టర్ వరకు ఫిర్యాదు వెళ్లడంతో డివిజన్ స్థాయి అధికారి సంబంధం లేదని చేతులెత్తేశారు. దీంతో ఆ సిబ్బంది, మండల స్థాయిలోని ఓ అధికారి ఇరకాటంలో పడ్డారు. కూటమి నేతలు అధికారులను పట్టుపట్టి బలవంతంగా పనులు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మామిడితోటలో ఉన్న ఇళ్లకు కూడా రోడ్డు వేయాలని ప్రయత్నించినట్లు విమర్శలు వస్తున్నాయి. అయితే అధికారుల ప్రయత్నంతో అక్కడ కూడా పనులు ఆగాయి. దీంతో చేసేదీ లేక అప్పయ్యగారిపల్లిలో అనుమతి లేని ప్రాంతాల్లో రోడ్లు వేయాలని చూశారు. ఈ విషయాన్ని అధికారులు, సిబ్బంది ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో అప్రమత్తమయ్యారు.

గర్భిణుల సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


సిబ్బంది, తల్లులతో మాట్లాడుతున్న అధికారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): గర్భిణులకు విధిగా సేవలు అందించాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ గంణాకాల అధికారి జార్జ్ హెచ్చరించారు. చిత్తూరు మండలం బీఎన్ఆర్ పేటలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, ముత్తుకూరు సచివాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం గర్భిణులు, తల్లులు సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. గర్భిణుల నమోదు విషయంలో అలసత్వం ఉండకూడదన్నారు. గ్రామాల్లో పర్యటిస్తూ గర్భిణుల వివరాలు, వైద్యసేవలు, చికిత్స తదితర విషయాలను తెలుసుకుంటూ మెరుగైన వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవంకు వెళ్లేలా గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో అధికారులు రామ్మోహన్, శిరీష తదితరులు పాల్గొన్నారు.